స్వభావం ఎలా అర్థమవుతుందో అలాగే మనిషి స్వభావాన్ని నిర్ణయించడానికి అతని జీవితం మొత్తం తీసుకోవాలి తప్ప ఎప్పుడో ఓ క్షణంలో చేసే చిన్న తప్పునో, చిన్న మాటనో పట్టుకుని అతనిలాంటి వాడు అని నిర్ధారణకి రాకూడదు."

తండ్రి బోధని అర్థం చేసుకున్న ఆ ముగ్గురు కొడుకులూ అటు తర్వాత సాటి మనుషుల్ని విమర్శించడం మానుకున్నారు.

## 104. స్వర్గానికి అర్హత

ఓ కారు ఏక్సిడెంట్‌లో ఓ మనిషి, అతని పెంపుడు కుక్క మరణించడంతో ఇద్దరూ పైకి వెళ్ళారు.

'స్వర్గం' అన్న అక్షరాలున్న బంగారు రంగు బోర్డు ఓ ద్వారం ముందు అతని కంట పడింది. అతను దాంట్లోకి వెళ్తూంటే ద్వార పాలకుడు ఆపి అడిగాడు.

"స్వర్గంలోకి కుక్కలని అనుమతించం. కావాలంటే నువ్వు ఒంటరిగా వెళ్ళచ్చు."

"ఇది పుట్టినప్పటి నించి నాదగ్గరే పెరుగుతోంది. దీన్ని వదలలేను." అతను ఇష్టపడక చెప్పాడు.

"అయితే నీకు స్వర్గంలోకి ప్రవేశం లేదు."

ఎదురుగా అతను ఇంకో ద్వారం మీద 'నరకం' అని రాసి వుండటం గమనించి తన కుక్కతో అటువైపు నడిచాడు. అక్కడి ద్వార పాలకులు కుక్కతో అతను లోపలికి వెళ్ళడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. లోపల సుందర వనాలు, అప్సరసా స్త్రీలు, బంగారు భవంతులు అతనికి కనిపించాయి.

"నరకం ఇంత వైభోగంగా వుంటుందని నేను ఎన్నడూ అనుకోలేదు." అక్కడున్న వారిలో ఒకరితో అతను ఆశ్చర్యంగా చెప్పాడు.

"ఇది నరకం అని ఎవరన్నారు? స్వర్గం." జవాబు చెప్పాడతను.

"మరి స్వర్గం అన్న బోర్డు ఎదుటి ద్వారం దగ్గర వుందిగా?"

"అది నరకం. తనతో వచ్చినవాళ్ళని తన స్వార్థం కోసం వదిలేసేవాళ్ళెవరో కనిపెట్టడానికి బోర్డులని అలా తారుమారుగా పెట్టారు." వివరించాడతను.